
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి 5 మెదక్
జిల్లాల వార్తలు
గురువారం 3 జూలై 2025




ఇందిరమ్మ ఇంటి మంజూరు పత్రంతో మహిళ

'ఇందిరమ్మ' మంజూరైందని
ఇల్లు కూలగొట్టించారు

- మంజూరు పత్రాలూ అందజేసిన అధికారులు
- భూమి పూజ చేసుకున్న లబ్ధిదారులు
- పనులు మొదలు పెడుదామంటే స్థలం తక్కువగా ఉందని నిరాకరణ
- నిలువ నీడ కోల్పోయిన నిరుపేదలు
- నర్సాపూర్‌లో 20 మంది బాధితులు

నర్సాపూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): తాతల కాలం నాటి పాత ఇళ్లలోనే ఏళ్లుగా కాలం వెళ్లదీస్తున్న పేదలు ఇందిరమ్మ ఇల్లు మంజూరవగానే సంబరపడ్డారు. ఇన్నాళ్లకు సొంతింటి కల నెరవేరుతుంది ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అధికారులు మంజూరు పత్రాలు చేతికివ్వడంతో పాత ఇంటిని కూలగొట్టి, శిథిలాలను తొలగించి భూమిని చదునుచేశారు. మంచిరోజులు వెళ్లిపోతున్నాయని భూమి పూజ కూడా చేసుకున్నారు. తీరా ఇంటి నిర్మాణ పనులు ప్రారంభిద్దామనగానే వారి ఆశలపై అధికారులు నీళ్లు గుమ్మరించారు. చూపించిన స్థల విస్తీర్ణం తక్కువగా ఉందని, మీకు ఇందిరమ్మ ఇల్లు రాదని చల్లగా చెప్పారు. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. కొత్త ఇల్లు వస్తుందని ఉన్న ఇంటిని కూలగొట్టి రోడ్డు పడ్డామని బావురుమంటున్నారు.

నర్సాపూర్ మున్సిపాలిటలోని 15 వార్డుల పరిధిలో 338 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. అందులో 327 ఇళ్లకు ప్రొసిడింగ్స్ ఇచ్చారు. 56 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. 8వ వార్డులో నివసించే స్వరూపకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైందని మంజూరు పత్రం ఇచ్చారు. దీంతో పాత ఇంటిని వెంటనే కూల్చివేసి కొత్త ఇంటి నిర్మాణం కోసం స్థలం సిద్ధం చేశారు. ఇంటి పనులు ప్రారంభించడానికి వచ్చిన అధికారులు ప్రభుత్వం నిర్దేశించిన దానికంటే స్థలం తక్కువగా ఉందని, ఇల్లు ఇవ్వలేమని తేల్చారు. ఇదే వార్డులో యాదమ్మ, 14వ వార్డులో మంగమ్మ పరిస్థితి కూడా ఇదే. ఇలా నర్సాపూర్

మిగతా 8వ పేజీలో

సహాయక చర్యలను పరిశీలించిన జగ్గారెడ్డి

- మీనాక్షి నటరాజన్, మహేశ్‌గౌడ్, దామోదర్ రాజనర్సింహతో కలిసి సిగాచి పరిశ్రమ సందర్శన


ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి సహాయక చర్యలను పరిశీలిస్తున్న జగ్గారెడ్డి

పటాన్‌చెరు రూరల్, ఆంధ్రజ్యోతి, జూలై 2: పటాన్‌చెరు మండలం పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో జరిగిన అగ్నిప్రమాదం తనను తీవ్రంగా కలిచివేసిందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి దామోదర్ రాజనర్సింహతో కలిసి సిగాచి పరిశ్రమలో చేపడుతున్న సహాయక చర్యలను ఆయన పరిశీలించారు.




తమవారి కోసం విలపిస్తున్న కుటుంబ సభ్యులు

సిగాచి పేలుడు ఘటన పరిశ్రమలోని కార్మికులు, సిబ్బంది జీవితాలను చిన్నాభిన్నం చేసింది. తమ వాళ్ల ఆచూకీ కోసం ఆ కుటుంబాలు పడుతున్న వేదన వర్ణించేందుకు కూడా వీలు కావడం లేదు. మూడు రోజులుగా వారంతా కన్నీళ్లు ఇంకిన స్థితిలో పరిశ్రమ వద్ద, ఆస్పత్రులు, మార్చురీ వద్ద పడిగాపులు కాస్తున్నారు. కనీసం తినాలనే ఆలోచన కూడా వారికి రావడం లేదు. ఏ క్షణంలో ఏ సమాచారం వినాల్సి వస్తోంది. తమ వాళ్లు అసలు బతికే ఉన్నారా? ఉంటే ఎక్కడా, చనిపోయిన వారిలో తమ వారెవరూ అన్న వేదన వారి కళ్లలో కనిపిస్తోంది. ఇక ఆస్పత్రుల్లో చావుబతుకుల మధ్య మృత్యువుతో పోరాడుతున్న వారి కోసం ఆప్తులు ఎదురుచూస్తున్నారు.

-పటాన్‌చెరు, రామచంద్రపురం టౌన్/ పటాన్‌చెరు రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి)

6


సిగాచి పరిశ్రమలో శిథిలాలను తొలగిస్తున్న దృశ్యం

కన్నీళ్లు ఇంకి..

తమవారి కోసం తపన.. తిరిగి వస్తారనే ఆశ

- తిండితిప్పలు వదిలి మూడు రోజులుగా ఎదురుచూపులు
- పరిశ్రమ, ఆస్పత్రులు, మార్చురీల వద్ద పడిగాపులు
- డీఎన్ఏతో మృతదేహాల గుర్తింపులో ఆలస్యం

ముమ్మరంగా శిథిలాల తొలగింపు

అంబులెన్స్ కూతపెట్టిందంటే బంధువుల గుండెల్లో దడపుడుతోంది. తమ వారిది కాదులే అంటూ సరిపెట్టుకుంటూనే అంతలో ఎవరిదో ఒక్కసారి చూద్దామనుకొని దగ్గరకు వెళ్తే బూడిదతో కూడిన మూట దర్శనం ఇస్తుంది. మాటలకు అందని ఇలాంటి దృశ్యాలు కంటతడి పెట్టిస్తున్నాయి. ఇంకా పలువురు బాధితులు పరిశ్రమలో తమ వారి కోసం గేట్ల బంధువులు పడిగాపులు కాస్తున్నారు. మరికొంత మంది ఆచూకీ తెలియాల్సి ఉండటంతో అధికారులు పూర్తి సమాచారం చెప్పడం లేదని ఆగ్రహిస్తున్నారు. కొందరు మంత్రి దామోదర్ రాజనర్సిహా ఎదుట తమ వాళ్లు ఎక్కడా అంటూ ఆందోళనకు దిగారు. మరో వైపు శిథిలాలు తొలగిస్తున్న నేపథ్యంలో ఏదైనా సమాచారం దొరుకుతుందా అని ముందుకు వెళ్లబోతుంటే పోలీసులు నిర్థాక్షణ్యంగా వెనక్కి నెట్టేస్తున్నారు. ముళ్లపొదల్లోనే కూర్చొని అంబులెన్స్ లోనికి వెళ్లగానే రోడ్డుపైకి వచ్చి గేటు వరకు నడుచుకుంటూ వెళ్లి అంబులెన్స్ లోపలి నుంచి

మిగతా 7వ పేజీలో...


క్షతగాత్రులను పరామర్శిస్తున్న మీనాక్షి నటరాజన్, దామోదర్


శిథిలాల దిబ్బగా మారిన పరిశ్రమ


తమవారి కోసం ఎదురుచూస్తున్న బంధువులు

అగ్గి పుడితే.. బుగ్గే

పారిశ్రామికవాడలో కానరాని అగ్నిమాపక కేంద్రం


పరిశ్రమల యాజమాన్యాలు సమకూర్చిన ఫైరింజన్లు

- పాశమైలారంలో 500 చిన్నా పెద్ద కంపెనీలు
- రెడ్ కేటగిరికి చెందిన 65 రసాయన పరిశ్రమలు
- సొంతంగా మూడు వాహనాలు సమకూర్చుకున్న యాజమాన్యాలు
- ఏళ్లుగా సిబ్బందిని కేటాయించని ప్రభుత్వం

7

ఆయిల్‌పామ్ సాగుకు రాయితీలు

మొక్కలు, డ్రిప్ పరికరాల పంపిణీ : మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

హవేళిఘణపూర్, జులై 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించేందుకు భారీ రాయితీలు ఇస్తున్నదని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం ఆయిల్‌పామ్ సాగుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 2024-25 సంవత్సరంలో 152 మంది రైతులు 533 ఎకరాలు ఆయిపామ్ సాగు చేశారని తెలిపారు. 2025-26 సంవత్సరానికి గాను 2,500 ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటల సాగు ప్రణాళిక రూపొందించామని పేర్కొన్నారు. ఇప్పటివరకు 1,677 ఎకరాల్లో సాగు కోసం రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోగా 771 ఎకరాల్లో సాగుకు సిద్ధం చేశారని వెల్లడించారు. ఉద్యానశాఖ ఆధ్వర్యంలో మొక్కలతో పాటు సాగుకు అవసరమయ్యే డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను సబ్సిడీపై అందజేస్తున్నామని తెలిపారు. నిజాంపేట మండలంలోని చల్మెడ గ్రామంలో లివ్‌ఫామ్ రిసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారు ఆయిల్‌పామ్ నర్సరీని ఏర్పాటు చేశారని, రైతులు వెళ్లి వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డీఏవో విన్సెంట్ వినయ్‌కుమార్, జిల్లా ఉద్యానశాఖ అధికారి ప్రతాప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని రాజిపేట, కొత్తపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వం నుంచి ఇళ్లు మంజూరైన ప్రతీ లబ్ధిదారులు కచ్చితంగా ఇల్లు కట్టుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వం అందజేయనున్న మొత్తం ఇంటి నిర్మాణ పనుల పురోగతి ఆధారంగా విడతలవారీగా ఖాతాల్లో నిధులు జమ చేస్తామని తెలిపారు. అనంతరం వార్డుల్లో పరిసరాల పరిశుభ్రతను పరిశీలించి ప్రజలకు సూచనలు చేశారు.

డ్రాప్‌అవుట్స్‌పై దృష్టిపెట్టండి

మెదక్ అర్బన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాల సాధన, డ్రాప్‌అవుట్స్ ఎన్‌రోల్‌మెంట్‌పై కలెక్టర్ రాహుల్‌రాజ్ బుధవారం నోడల్ అధికారులు, ఎంఈవోలతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. టెన్త్, ఇంటర్‌లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషిచేయాలని సూచించారు. పదో తరగతి పాసైన విద్యార్థులందరినీ ఇంటర్‌లో.. ఇంటర్ విద్యార్థులను డిగ్రీలో ఎన్‌రోల్‌మెంట్ చేయించాలన్నారు.



హవేళిఘణపూర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్




సంగారెడ్డి పట్టణంలో దుకాణాల ఎదుట రోడ్డుపైనే నిలిపిన వాహనాలు

ఇష్టారాజ్యంగా పార్కింగ్
ట్రాఫిక్ అస్తవ్యస్తం

- రోడ్లపైనే అడ్డదిడ్డంగా వాహనాలు
- పాదచారులకు నడకయాతన
- రాకపోకలకు ఆటంకం
- జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో ట్రాఫిక్ కష్టాలు

సంగారెడ్డి క్రైం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. దుకాణాలు, వాణిజ్య సంస్థల ఎదుట రోడ్లపైనే అడ్డదిడ్డంగా వాహనాలు నిలుపడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. పట్టణంలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తా నుంచి పాత బస్టాండ్ వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా రోడ్లపైనే వాహనాలను నిలుపుతున్నారు. దీంతో పాదచారులు నడవడానికి తంటాలు పడుతున్నారు. జిల్లా కేంద్రానికి నిత్యం వేలాదిమంది వస్తుంటారు. వ్యాపార, వాణిజ్య సంస్థల వద్ద పార్కింగ్ స్థలం లేకపోవడంతో వాహనదారులు రోడ్లపైనే వాహనాలను నిలుపుతున్నారు. సంగారెడ్డి పట్టణంలోనే ఉన్నతాధికారులంతా నివాసముంటారు. నిత్యం వారు కార్యాలయాలకు వెళ్లే సమయంలో ట్రాఫిక్‌ను పరిశీలిస్తూనే ఉన్నా చర్యలు మాత్రం తీసుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. పార్కింగ్ కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించి ట్రాఫిక్ సమస్యకు చెక్ పట్టాలని వారు కోరుతున్నారు.



ప్రధాన రహదారి పక్కన ఇలా..

'సింగూరు'కు
స్వల్ప వరద

- ఎగువన కురిసిన వర్షాలకు 1,560 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 19.219 టీఎంసీలకు చేరిన ప్రాజెక్టు నీటి మట్టం


సింగూరు ప్రాజెక్టు

పుల్‌కల్, జూలై 2: వానాకాలం సీజన్ ప్రారంభమైన తరువాత తొలిసారి సింగూరు ప్రాజెక్టుకు వరద వచ్చింది. ఎగువన కురుస్తున్న వర్షాలకు బుధవారం ఉదయం వరకు 24 గంటల్లో 1,560 క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టులో చేరింది. ఎగువన మంజీర పరివాహక ప్రాంతంలో కర్ణాటక, మహారాష్ట్రతో పాటు సంగారెడ్డి జిల్లాలోని పలు మండలాల్లో కురుస్తున్న వర్షానికి వరద నీరు వస్తున్నది. గత రెండు రోజుల్లో 2,790 క్యూసెక్కుల వరద నీరు చేరింది. సింగూరు ప్రాజెక్టు పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం 523.600 మీటర్ల వద్ద 29.917 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 521.290 మీటర్లకు 19.219 టీఎంసీలుగా ఉంది. నీటి సరఫరా ప్రాజెక్టులు, ఆవిరి రూపంలో 540 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదయింది. ఇప్పటివరకు పెద్ద వర్షాలు కురియకపోయినా ప్రాజెక్టులో ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు ఉన్నాయని ప్రాజెక్టు డీఈఈ నాగరాజు, ఏఈఈ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

గాలివాన బీభత్సం 6







గాలివాన బీభత్సం

- పలుచోట్ల నేలకొరిగిన చెట్లు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- పెచ్చులూడిన చిన్నశంకరంపేట తహసీల్దార్ ఆఫీస్ భవనం పైకప్పు



తూప్రాన్ బస్టాండ్ వద్ద పాత హైవే రోడ్డుపై నేల కూలిన భారీ వృక్షం





చెట్టు మీదపడడంతో ధ్వంసమైన బైక్, ఆటో

తూప్రాన్, జూలై 2(ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు, ఈదురు గాలులకు తూప్రాన్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా పాత హైవే రోడ్డుపై బుధవారం ఓ భారీ వేప వృక్షం నేలకూలింది. మధ్యాహ్నం చెట్టు కూలిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే, అక్కడ నిలిపి ఉంచిన ఓ బైక్, ఆటోరిక్షా దెబ్బతిన్నాయి.

ఎంఈవో కార్యాలయం వద్ద..

నర్సాపూర్, జూలై 2(ఆంధ్రజ్యోతి): రాత్రి నుంచి అడపాదడపా కురుస్తున్న వర్షాలకు నర్సాపూర్ పట్టణంలోని ఎంఈవో కార్యాలయం వద్ద ఓ చెట్టు భారీ కొమ్మ విరిగిపడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

పెచ్చులూడిన పైకప్పు

చిన్నశంకరంపేట/నిజాంపేట, జూలై 2 (ఆంధ్రజ్యోతి) :వారంరోజులుగా కురుస్తున్న వర్షానికి చిన్నశంకరంపేటలోని తహసీల్దార్ కార్యాలయం భవనం పైకప్పు పెచ్చులూడి పడ్డాయి. ఈ భవనాన్ని 2000 సంవత్సరంలో నిర్మించారు. 25 ఏళ్లు గడుస్తున్నా నూతన భవనానికి మోక్షం లేదు. సంవత్సరం క్రితం తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. బుధవారం సిబ్బంది కార్యాలయంలోకి రాగానే పెచ్చులూడి పడడంతో బయటకు పరుగులు తీశారు. ఈ విషయమై అధికారులకు నివేదిక అందిస్తున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. అలాగే నిజాంపేట మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి పెంకుటిల్లు కూలిపోయింది.

కాలిపోయిన ఎంసీబీ స్విచ్‌లు

నారాయణఖేడ్/నాగల్‌గిద్ద, జూలై 2(ఆంధ్రజ్యోతి) : ఖేడ్ పట్టణంలో మూడురోజులుగా మోస్తారు, ముసురు వర్షం కురుస్తుంది. దీంతో మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్ లైట్లు, బట్టర్ ఫ్లై లైట్లకు సంబంధించి రాయిపల్లి రోడ్డు, బసవేశ్వర చౌక్, ఏఎస్‌నగర్ కాలనీ, ర్యాకల్ రోడ్డులో ఉన్న ఎంసీబీ స్విచ్‌లు బుధవారం తెల్లవారుజామున కాలిపోయాయి. మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ ఆదేశాల మేరకు బుధవారం మున్సిపల్, విద్యుత్‌శాఖ విభాగం పర్యవేక్షకుడు అమర్ ఆధ్వర్యంలో ఎలక్ట్రీషియన్లు కొత్త ఎంసీబీ స్విచ్‌లను ఏర్పాటు చేశారు.



పెచ్చులూడిన చిన్నశంకరంపేట తహసీల్దార్ కార్యాలయ భవనం పైకప్పు



నర్సాపూర్ ఎంఈవో కార్యాలయం వద్ద విరిగిపడ్డ చెట్టుకొమ్మ

కొనసాగుతున్న ధ్రువపత్రాల పరిశీలన



నంగునూరు మండలం రాజగోపాలపేట పాలిటెక్నిక్ లో సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు


నంగునూరు, జూలై 2(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కళాశాలల్లో బీటెక్ కోర్సుల్లో ప్రవేశానికి ఎప్‌సెట్‌లో ర్యాంకులు పొందిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన రెండో రోజు బుధవారం కొనసాగింది. నంగునూరు మండలం రాజగోపాలపేట పాలిటెక్నిక్ కళాశాలలో 470 మంది అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించినట్లు ప్రిన్సిపాల్ గోవర్ధన్ తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రత్యేక అధికారి అభినవ్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ జరుగుతోందని, టీజీ ఎప్‌సెట్‌లో పొందిన ర్యాంకుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దరఖాస్తులను పరిశీలించి లాగిన్ ఐడీ కేటాయించారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది పాతూరి శ్రీనివాస్ రెడ్డి, సయ్యద్ షహబాజ్, విజయ్ కుమార్, రాజు, శ్రీనివాస్, రాజమౌళి, మధుబాబు, సంతోష్, నవీన, వాణి, కవిత, మంజుల తదితరులు పాల్గొన్నారు.



ఘటనా స్థలంలో పడి ఉన్న మృతదేహాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

నాగల్‌గిద్ద, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన ఘటన నాగల్‌గిద్ద పోలీసుస్టేషన్ పరిధి గంగారాం తండా సమీపంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. నాగల్‌గిద్ద ఎస్ఐ సాయిలు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఎనక్‌పల్లి పత్తునాయక్ తండాకు చెందిన రాథోడ్ మారుతి (40), గంగారాం తండాకు చెందిన చౌహాన్ మారుతి (50)లు బైక్‌పై వెళుతుండగా గంగారాం తండా సమీపంలో రహదారిపై ప్రమాదానికి గురై మృతిచెందారు. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు. మరో వాహనం ఢీకొట్టిందా? వీరే ప్రమాదానికి గురయ్యారా? తెలియాల్సి ఉందని ఎస్ఐ సాయిలు వివరించారు.



జూదమాడుతున్న 10 మంది అరెస్టు

- ఒకరు పరారీ

పాపన్నపేట, జూలై 2(ఆంధ్రజ్యోతి): ఏడుపాయలలోని ప్రైవేట్ గెస్ట్‌హౌస్‌లు జూదగాళ్లకు అడ్డాగా మారాయి. మంగళవారం రాత్రి పాపన్నపేట పోలీసులు దాడులు నిర్వహించి పలువురిని అరెస్టు చేశారు. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏడుపాయల శివారులోని ప్రైవేట్ సత్రాల్లో పలువురు జూదం ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. కౌడిపల్లి, హత్నూర, చిలప్‌చెడ్ మండలాలకు చెందిన 10 మందిని అదుపులోకి తీసుకోగా, ఒకరు పారిపోయారు. వారి వద్ద నుంచి రూ.74,350 నగదు, 9 సెల్ ఫోన్లు, 2కార్లు, 5బైక్‌లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలో ఎక్కడైనా పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతంలో కూడా ఏడుపాయలలో జూదగాళ్లు పట్టుబడిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఆధ్యాత్మిక ప్రాంతమైన ఏడుపాయల దుర్గామాత ఆలయ పరిసరాలు జూదగాళ్లకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది. ఎక్కడైనా జూదం ఆడుతున్నట్లు గుర్తిస్తే సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పోలీసులు సూచించారు.

వదినపై మరిది అత్యాచారం

- బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు

పాపన్నపేట, జూన్ 2(ఆంధ్రజ్యోతి): వదిన వరుసయ్యే భార్య సోదరిపై కన్నేసిన ఓ వ్యక్తి అదను చూసి కాటేశాడు. జరిగిన విషయాన్ని చెప్పితే చంపుతానని బెదిరించి, అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ అందించిన వివరాలిలా ఉన్నాయి.. మెదక్ చెందిన ఓ యువతికి 14 యేళ్ల క్రితం వివాహం జరుగగా, ఓ కూతురు జన్మించింది. కొన్ని కారణాల వలన 2013లో భర్తతో విడాకులు తీసుకొని, తల్లి గారింటి వద్ద ఉంటుంది. ఆమె చెల్లెలు తల్లిని, అక్కను చూడడానికి పిల్లలను తీసుకొని రెండు రోజుల క్రితం పుట్టింటికి వచ్చింది. మంగళవారం తన ఇంటికి వెళ్తానని చెప్పడంతో చెల్లెలిని అత్తగారింట దిగబెట్టేందుకు ఆమె వెళ్లింది. ఇద్దరూ ఇంటికి రాగా, తిరుగు ప్రయాణం అయ్యేందుకు సిద్ధంగా ఉన్న భార్య అక్కను ఆమె భర్త (వరుసకు మరిది) ద్విచక్రవాహనంపై వదిలి వస్తానని తీసుకెళ్లాడు. ఏడుపాయల కమాన్ వద్దకు రాగానే, అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి, ఆమెను బయపెట్టి అత్యాచారం చేశాడు. ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. దీంతో ఇంటికి వెళ్లిన తర్వాత బాధితురాలు జరిగిన విషయాన్ని తన తల్లికి చెప్పింది. వారిద్దరు కలసి పాపన్నపేటకు వచ్చి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

అగ్గి పుడితే.. బుగ్గే





రామచంద్రాపురం టౌన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): పాశమైలారం పారిశ్రామికవాడలో అగ్గి అంటుకుంటే బుగ్గి మాత్రమే మిగులుతోంది. చిన్నా పెద్ద 500 కంపెనీలున్న పారిశ్రామిక వాడలో ప్రభుత్వం అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయలేదు. అవసరమైనప్పుడు 10 కిలోమీటర్ల దూరంలో పటాన్‌చెరు నుంచి ఫైరింజన్లు రావాల్సిందే. రసాయన పరిశ్రమల్లో అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువ. ప్రమాదం సంభవిస్తే మొదటి 20 నిమిషాలు అత్యంత విలువయినదిగా భావిస్తారు. కానీ, స్థానికంగా ఫైర్‌స్టేషన్ లేకపోవడంతో పాశమైలారంలో ప్రమాదాలు జరిగినప్పుడు నష్టం తీవ్రంగా ఉంటోంది. సిగాచీ పరిశ్రమలో ప్రమాదంతో మరోసారి ఫైర్‌స్టేషన్ ఆవశ్యకత తెలిసివచ్చింది.

ప్రమాదాలు నిత్యకృత్యం

పాశమైలారం పారిశ్రామికవాడలో విభిన్న ఉత్పత్తుల కంపెనీలు 500 వరకు ఉన్నాయి. రోజూ లక్ష మంది కార్మికులు,ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తుంటారు. నిత్యం ఏదో పరిశ్రమలో అగ్నిప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. పెద్ద సంఘటనలు జరిగినప్పుడు మాత్రమే బయటకు తెలుస్తున్నది. అగ్నిప్రమాదాలు జరిగితే 10 కిలోమీటర్ల దూరంలోని పటాన్‌చెరు నుంచి అగ్నిమాపక వాహనం వచ్చేసరికి అరగంట సమయం పడుతుంది. ఈలోపు జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. తాజాగా సిగాచీ పరిశ్రమలో జరిగిన పేలుడు సమయంలోనూ వివిధ ప్రాంతాల నుంచి ఫైరింజన్లను రప్పించారు. పదుల సంఖ్యలో ఫైరింజన్లు గంటల తరబడి కష్టపడినా మంటలు అదుపులోకి రాలేదు. స్థానికంగా ఫైర్‌స్టేషన్ ఉంటే నష్టం తక్కువగా ఉండేదేమోనని అభిప్రాయం వ్యక్తమవుతున్నది. గతంలోనూ ఓ రసాయన పరిశ్రమలో అగ్నిప్రమాదం జరిగినప్పుడు రసాయనాలు నిల్వ చేసిన డ్రమ్ములు ఎగిరి పడ్డాయి. అగ్నిమాపక రాక ఆలస్యం కావడంతో రసాయనాలు రోడ్లపై పారి ప్రమాదకరంగా మారింది. అగ్నిమాపక వాహనం మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా సాధ్యం కాకపోవడంతో ఆస్తి నష్టం జరిగిపోయింది. ఆ కంపెనీ ఇప్పటికీ కోలుకోలేదు.

సొంతంగా వాహనాలు కొనుగోలు చేసినా..

పాశమైలారం 'ఐలా అసోసియేషన్' తరఫున వివిధ పరిశ్రమల సహకారంతో రూ.1.5 కోట్లతో సొంతంగా మూడు వాహనాలు సమకూర్చుకున్నారు. వీటిని నిర్వహించడానికి 16 మంది సిబ్బందిని నియమించారు. ప్రతీ నెల సిబ్బంది వేతనాలకు రూ.4లక్షలు, వాహనాల నిర్వహణకు మరో లక్ష రూపాయలు ఖర్చు చేస్తున్నారు. వాహనాలు ఉన్నాయి కాబట్టి నిపుణులైన ఫైర్ సిబ్బందిని నియమించాలని గత ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం కేసీఆర్‌ను పారిశ్రామికవేత్తలు కలిసి విన్నవించారు. పలుమార్లు మంత్రి కేటీఆర్‌ను కలిసి వివరించినా ఫలితం దక్కలేదు. 35 మంది చేయాల్సిన చోట 16 మందితోనే ప్రైవేటుగా ఫైర్ వాహనాలను నిర్వహిస్తున్నారు.



ఐలా భవనంలో బాధిత కుటుంబాలకు చెందినవారికి భోజనాలు

కన్నీళ్లు ఇంకి..

(5వ పేజీ తరువాయి)

బయటకు వచ్చే వరకు ఎదురుచూస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టిస్తోంది. పరిశ్రమ శిథిలాల కింద మరో మృతదేహం దొరికింది. పూర్తిగా కాలిముద్దగా మారిన మృతదేహాలను గుర్తు పట్టే పరిస్థితి లేకుండా పోయింది. మరో వైపు ముఖ్యుల తాకిడి ఉండటంతో ఇబ్బందులు మరింత పెరిగాయి. పోలీసుల బందోబస్తు ఏర్పాటు ముమ్మరం చేయడం బాధితుల పాలిట శాపంగా మారుతోంది.

ఐలాభవన్‌లో ..

పరిశ్రమకు దగ్గరలో ఉన్న ఐలాభవనంలో డీఎన్ఏ పరీక్షలు నిర్వహిస్తున్నారు. రక్తనమూనాలు తీసుకుంటున్నారు. పరీక్షలు పూర్తయిన తరువాత అక్కడే వేచి ఉండమంటున్నారు. మధ్యాహ్నం సాయంత్రం సమయాల్లో అధికారులు బాధిత కుటుంబసభ్యులకు భోజన ఏర్పాట్లు చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన బంధువులకు అధికారులు దారి ఖర్చుల నిమిత్తం రూ.10వేలు అందజేస్తున్నారు. రాత్రి బస చేయడానికి గుమ్మడిదల తహసీల్దార్ పరమేష్ ఐలాభవనంలోనే ఏర్పాట్లు చేశారు.



వివరాలు నమోదు చేసుకుంటున్న అధికారులు



తప్పు మాది కాదంటే..

పాశమైలారం ఘటనలో బాధ్యతను విస్మరిస్తున్న ప్రభుత్వ విభాగాలు

- పేలుడుకు ఫ్యాక్టరీల విభాగం, పీసీబీ అధికారుల నిర్లక్ష్యమే కారణమంటున్న కార్మిక సంఘాలు
- భద్రతా సిఫారసులు యాజమాన్యానికి పంపామంటున్న ఫ్యాక్టరీల విభాగం
- తమ పాత్ర స్వల్పమే అంటున్న టీజీ పీసీబీ అధికారులు

హైదరాబాద్ సిటీ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పాశమైలారంలోని సిగాచి ఫ్యాక్టరీ పేలుడు ఘటనలో వేర్వేరు ప్రభుత్వ విభాగాలు తమ బాధ్యతను విస్మరిస్తున్నాయని కార్మికులు, కార్మిక సంఘాలు ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పారిశ్రామిక వాడల్లో పరిశ్రమలు లేదా ఫ్యాక్టరీల ఏర్పాటు, భద్రతాచర్యల పర్యవేక్షణలో ప్రభుత్వ ఫ్యాక్టరీల విభాగం, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) పాత్ర కీలకం. అయితే.. భద్రతా ప్రోటోకాల్‌ను అమలు చేయడంలో మేనేజ్‌మెంట్ నిర్లక్ష్యాన్ని ఫ్యాక్టరీల విభాగం ఎత్తిచూపుతుండగా, సిగాచి ఫ్యాక్టరీకి అనుమతులు, భద్రతా పర్యవేక్షణతో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి తమకు సంబంధం లేదంటోంది. పీసీబీ అధికారుల, భద్రతా చర్యలను పటిష్ఠంగా అమలు చేయడంలో ఫ్యాక్టరీల విభాగం అధికారుల వైఫల్యాన్ని సిగాచి ఫ్యాక్టరీలో పేలుడు ఎత్తిచూపుతోంది. ఫ్యాక్టరీలో కార్మికుల భద్రతకు చేపట్టాల్సిన చర్యలపై సిగాచి యాజమాన్యానికి సిఫారసులు చేశామని, అయినప్పటికీ వారు తమ సిఫారసులను విస్మరించారని ఫ్యాక్టరీల విభాగం ఉన్నతాధికారి ఒకరు తాజాగా ఆరోపించారు. అయితే.. సదరు భద్రతా సిఫారసులను ఖచ్చితంగా అమలు చేసేలా ఎందుకు చర్యలు చేపట్టలేదని ఫ్యాక్టరీల విభాగం అధికారులను కార్మిక సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

సిగాచి ఘటనను పరిశీలనకు సెంట్రల్ పీసీబీ కమిటీ..

పాశమైలారంలో జరిగిన పేలుడు ఘటన పర్యవసానాలను పరిశీలించేందుకు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి కమిటీని నియమించినట్లు తెలిసింది. త్వరలో ఈ కమిటీ ఘటనాస్థలానికి వచ్చి పర్యావరణపై ప్రభావాన్ని అంచనా వేయనుంది. ఈ మేరకు సీపీసీబీ అధికారులు తెలంగాణ పీసీబీ అధికారులకు సమాచారమిచ్చినట్లు సమాచారం. అయితే, ఆ ప్రదేశంలో జరుగుతున్న రెస్క్యూ ఆపరేషన్ ముగిశాకనే టీజీపీసీబీ బృందం అక్కడికి వెళుతుందని చెప్పారు.

గతంలో పేలుడు సంభవించినా..

సిగాచి ఫ్యాక్టరీలో ఇంతకు మునుపు ఒకసారి పేలుడు సంభవించినా అటు ఫ్యాక్టరీ యాజమాన్యం, ఇటు ప్రభుత్వ విభాగాల అధికారులు సరైన భద్రతా చర్యలు తీసుకోకపోవడంతో.. తాజా ఘటన తీవ్రమైన విషాదాన్ని మిగిల్చింది. గతంలో ప్రాణనష్టం జరగకపోవడంతో ఆ ఘటన వెలుగులోకి రాలేదని సమాచారం. గుజరాత్‌కు చెందిన సిగాచి యాజమాన్యం, త్వరలో ఆందోల్ నియోజకవర్గంలోని అమీన్‌పూర్‌లో మరొక యూనిట్‌ను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా పీసీబీ అధికారులు, ఫ్యాక్టరీల విభాగం ఉన్నతాధికారులు మేల్కొని ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఫ్యాక్టరీలను మూసివేయాలని డిమాండ్ చేస్తున్నారు.



సంఘటన స్థలం వద్ద కలెక్టర్, ఎస్పీ

ముమ్మరంగా శిథిలాల తొలగింపు

రామచంద్రాపురం టౌన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): సిగాచి పరిశ్రమలో శిథిలాల తొలగింపు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోష్‌లు పరిశ్రమల్లో అన్ని రకాల వ్యర్థాలను తొలగించే పనిలో పడ్డారు. ఇందుకోసం సిబ్బంది రెండు షిఫ్టుల్లో పని చేస్తున్నారు. అదనపు కలెక్టర్లు మాధురి, చంద్రశేఖర్‌లు రెవిన్యూ, పంచాయతీశాఖల అధికారులతో బృందాలుగా ఏర్పాటు చేసి సహాయక పనులు చేపట్టారు. బాధిత కుటుంబసభ్యులకు భోజనవసతి సౌకర్యాలు కల్పించారు. మృతదేహాల అప్పగింత పనులు పూర్తిచేయడానికి జిల్లా వైద్యాధికారి గాయత్రిదేవి ఆధ్వర్యంలో డీఎన్ఏ పరీక్షలు రెండు ప్రాంతాల్లో నిర్వహిస్తున్నారు. కొన్ని చోట్ల ఇంకా పొగలు వస్తుండగా, అగ్నిమాపక సిబ్బంది పొగరాకుండా ఫోమ్ పిచికారి చేశారు.

బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుంది : వీహెచ్



పరిశ్రమను సందర్శించిన వీహెచ్ హనుమంతరావు

పటాన్‌చెరు రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : సిగాసి పరిశ్రమలో మృతి చెందిన మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వీహెచ్ హనుమంతరావు అన్నారు. ఆయన బుధవారం పరిశ్రమను సందర్శించి మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అనంతరం విలేకరులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ తన రాజకీయ జీవితంలో ఇంత దారుణమైన దుర్ఘటన ఎప్పుడూ చూడలేదన్నారు. బాధ్యులు ఎంతటి వారైనా చర్యలు కఠినంగా ఉండాలన్నారు. సేఫ్టీ అధికారులు విరివిగా పరిశ్రమలను తనిఖీ చేసి మిషనరీ పాతదా, కొత్తదా అని పరిశీలించడంతో పాటు, కార్మికుల రక్షణపై ఎంతవరకు చర్యలు తీసుకుంటున్నారు అనే విషయమై ఆరా తీయాలన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. రేవంత్ కూడా జరిగిన సంఘటనపై ఆగ్రహంగా ఉన్నారని ఆయన బాధిత కుటుంబాలకు న్యాయం చేస్తారన్నారు.

ప్రమాదాలకు దారితీస్తున్న తనిఖీల లోపం

- హెచ్ఎంఎస్ రాష్ట్ర నాయకుడు ఈశ్వర్‌ప్రసాద్



ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో నినాదాలు చేస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

కంది, జూలై 2(ఆంధ్రజ్యోతి): పాశమైలారంలోని సిగాచి ఫ్యాక్టరీలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదానికి నిపుణులైన సేఫ్టీ తనిఖీలు లేకపోవడమే కారణమని హెచ్ఎంఎస్ (హిందూ మజ్దూర్ సభ) రాష్ట్ర నాయకుడు ఈశ్వర్‌ప్రసాద్ ఆరోపించారు. బుధవారం కంది మండలం ఎద్దుమైలారం వద్దగల ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో ఉద్యోగ సంఘాల నాయకులు సిగాచి మృతులకు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఈశ్వర్‌ప్రసాద్ మాట్లాడుతూ.. 2020లో నాటి ప్రభుత్వం తీసుకొచ్చిన 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' పేరిట ఫ్యాక్టరీల ఫైర్‌సేఫ్టీ, పొల్యూషన్ బోర్డు తనిఖీలను తొలగించిందన్నారు. థర్డ్‌పార్టీ పేరిట కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ఉన్న జీవోను తాము ఖండిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి పాత జీవోను రద్దు చేసి పరిశ్రమలను కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



కొత్త మోడళ్లకు డిమాండ్



వినాయక విగ్రహాల తయారీకి 9నెలలపాటు శ్రమిస్తాం. గత 22ఏళ్లుగా తూప్రాన్‌లో విగ్రహాలు తయారు చేస్తున్నాం. ప్రతీ సంవత్సరం కొత్త మోడళ్లకు మంచి డిమాండ్ ఉంటుంది. భక్తుల అభిరుచులకు తగ్గట్టుగా విగ్రహాలను రూపొందిస్తాం.

-గణపతి, తయారీదారు

ముస్తాబవుతున్న గణనాథులు

● తూప్రాన్‌లో జోరుగా విగ్రహాల తయారీ



తూప్రాన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సమీపిస్తుండడంతో తూప్రాన్‌లో వినాయక విగ్రహాల తయారీ జోరుగా సాగుతోంది. సాధారణంగా పది రోజుల వినాయక నవరాత్రి ఉత్సవాలకు, తొమ్మిది నెలల ముందు నుంచే విగ్రహాలను తయారు చేస్తారు. హైదరాబాద్‌కు పరిమితమైన విగ్రహాల తయారీ ప్రస్తుతం మెదక్ జిల్లా తూప్రాన్ పరిసర ప్రాంతాల్లోనూ జరుగుతోంది. ఆగస్టు చివరిలో జరిగే వినాయక నవరాత్రి ఉత్సవాల కోసం జనవరి నుంచే విగ్రహాల తయారీ మొదలైంది.

40 మంది..

రాజస్థాన్ నుంచి తెచ్చిన ప్రత్యేక బంకమట్టి (కచ్చమట్టి)ని ఉపయోగించి కొబ్బరి పీచు, కర్రల సహాయంతో విగ్రహాలను రూపొందిస్తున్నారు. తూప్రాన్‌లో దాదాపు 40 మంది విగ్రహాల తయారీలో నిమగ్నమై ఉన్నారు. వినాయక చవితి నాటికి 500 వరకు విగ్రహాలను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే విగ్రహాల తయారీ పూర్తవగా, ఇప్పుడు రంగులు వేసే పనిలో ఉన్నారు. రంగులు వెలిసిపోకుండా విక్రయించే సమయంలోనే చివరి మెరుగులు దిద్దుతారు.

30 మోడల్స్‌లలో..

మెదక్, కామారెడ్డి, నిజామాబాద్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల భక్తులు తూప్రాన్ నుంచే విగ్రహాలను కొనుగోలు చేస్తుంటారు. ఈ ఏడాది సుమారు 30 కొత్త మోడల్స్‌లో విగ్రహాలు తయారు చేస్తున్నారు. ఒక్కో మోడల్ మోల్డింగ్‌కు రోజుకు రూ.5వేల వరకు ఖర్చు అవుతోందని తయారీదారులు తెలిపారు. విగ్రహాల పరిమాణాన్ని బట్టి రూ.2వేల నుంచి రూ.15 వేల వరకు విక్రయిస్తామని చెప్పారు.

గీతం స్నాతకోత్సవ ముఖ్య అతిథిగా కిరణ్ కార్నిక్

- సభాధ్యక్షత వహించనున్న గీతం అధ్యక్షుడు, విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్



కిరణ్ కార్నిక్

పటాన్‌చెరు రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : నాస్కామ్ పూర్వ అధ్యక్షుడు, భారతదేశ ఐటీ, అంతరిక్ష రంగాలలో ప్రముఖుడు కిరణ్ కార్నిక్ ఈ నెల 19న జరగనున్న గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం 16వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. హైదరాబాద్ ప్రాంగణంలో నిర్వహించే ఈ వేడుకకు గీతం అధ్యక్షుడు, విశాఖపట్నం పార్లమెంటు (లోక్ సభ) సభ్యుడు ఎం.శ్రీభరత్ సభాధ్యక్షత వహించనున్నట్టు బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. గీతం కులపతి డాక్టర్ వీరందర్ సింగ్ చౌహాన్, ఉప కులపతి ప్రొఫెసర్ ఎర్రోల్ డిసౌజా, అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, రిజిస్ట్రార్ డాక్టర్ డి.గుణశేఖరన్ కూడా ఈ వేడుకలో పాల్గొంటారని తెలియజేశారు.

జీఎంసీ ప్రిన్సిపాల్‌కు ఏడీఎంఈ పోస్టింగ్



డా.వాణి

సంగారెడ్డి అర్బన్, జూలై 2(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి ప్రభుత్వ మెడికల్ కాలేజీ (జీఎంసీ) ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వాణికి అడిషనల్ డీఎంఈగా పోస్టింగ్ ఇస్తూ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ ఎ.నరేంద్రకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్‌లోని డీఎంఈ కార్యాలయంలో ఇప్పటికే ఖాళీగా ఉన్న అడిషనల్ డీఎంఈ పోస్టులో ఆమెను నియమించారు. రెగ్యులర్ ప్రిన్సిపాల్ నియామకం అయ్యే వరకు ఇక్కడ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా డాక్టర్ సుధామాధురి కొనసాగనున్నారు.

నలుగురు గంజాయి విక్రేతల అరెస్టు

దుబ్బాక, జూలై2(ఆంధ్రజ్యోతి): గంజాయి సేవిస్తూ, విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. దుబ్బాక సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం ఒరిస్సా రాష్ట్రానికి చెందిన మహ్మద్ అజారుద్దీన్(26) దుబ్బాకలో నివాసం ఉంటున్నాడు. తనతోపాటు దుబ్బాకకు చెందిన పోతరాజు సింహాద్రి(22), సిద్దిపేట మండలం తోర్నాల గ్రామానికి చెందిన పల్లటి దినేష్(22), మాడ్గుల నరహరిలు స్థానిక బాలాజీ దేవాలయం వెనక గల వెంచర్‌లో గంజాయి సేవిస్తున్నారు. ఈ విషయమై సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 100గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించగా, ఒరిస్సాకు చెందిన గుర్తుతెలియని వ్యక్తి వద్ద కొనుగోలు చేసి విక్రయించడంతోపాటు సేవిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు వారిని అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపినట్టు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

న్యూస్ బాక్స్

'మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టాలి'

చిన్నశంకరంపేట, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండలంలోని అన్ని గ్రామాల్లో మొక్కలు నాటేందుకు పంచాయతీ కార్యదర్శులు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో దామోదర్ అన్నారు. బుధవారం ఎంపీపీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. వన మహోత్సవం సందర్భంగా పర్యావరణం కాపాడే దిశగా మొక్కలు నాటేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

తారా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్‌గా రమేశ్

సంగారెడ్డి అర్బన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డా.పి.రమేశ్ నియమితులయ్యారు. ఇప్పటివరకు ప్రిన్సిపాల్‌గా పనిచేసిన రత్నప్రసాద్ ఉద్యోగ విరమణ చేసిన విషయం తెలిసిందే. దీంతో జోగిపేట డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న రమేశ్‌కు తారా కళాశాల ప్రిన్సిపాల్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా నూతన ప్రిన్సిపాల్ రమేశ్‌కు అధ్యాపకులు, ఉద్యోగులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

డిగ్రీ, పీజీ ఫెయిలైన అభ్యర్థులకు చివరి అవకాశం

సంగారెడ్డి అర్బన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ, పీజీ పూర్తిచేసి ఫెయిలైన అభ్యర్థులకు వన్‌టైం సెటిల్మెంట్ కింద పరీక్ష రాయడానికి చివరి అవకాశం కల్పించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. 2016-17, 2017-18, 2018-19 వార్షిక విద్యా సంవత్సరాల్లో డిగ్రీ ఆరు సెమిస్టర్లు, పీజీలో నాలుగు సెమిస్టర్లు రాసి ఫెయిలైన విద్యార్థులకు ఆయా సబ్జెక్టులకు పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు కళాశాలలోని పరీక్షల విభాగాన్ని సంప్రదించాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నారాయణఖేడ్/నాగల్‌గిద్ద, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ మండలం చాప్టాకె గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు అల్లాభక్ష్(28) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని కుటుంబీకులు చికిత్స నిమిత్తం ఖేడ్ ఏరియా వైద్యశాలలో చేర్పించారు. విషయం తెలుసుకున్న డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా నాయకులు సుధాకర్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి అతడిని పరామర్శించారు.

సమస్యల పరిష్కారంలో తపస్ ముందంజ

నిజాంపేట, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో తపస్ ఎల్లప్పుడూ ముందుంటుందని ఆ శాఖ మండల అధ్యక్షుడు ఉమ్లానాయక్ పేర్కొన్నారు. మండలంలోని నార్లాపూర్ గ్రామంలో బుధవారం వివిధ పాఠశాలల్లో సభ్యత నమోదు చేపట్టారు. వీరితోపాటు తపస్ సభ్యులు రాజశేఖర్, రవీందర్‌రెడ్డి, అర్జున్ ఉమామహేశ్వరరావు, కృష్ణ, యాదగిరి, ప్రవీణ్, నరేష్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి బీఎల్‌వోలకు శిక్షణ

నర్సాపూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 3వ తేదీ నుంచి నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాలవారీగా బూత్ లెవల్ అధికారులు(బీఎల్‌వో)లకు శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో మహిపాల్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 3న శివ్వంపేట మండల పరిధిలోని వారికి రైతువేదికలో 4న కొల్చారం మండలం, 7న కౌడిపల్లి, 8న నర్సాపూర్ మండలానికి సంబంధించి స్థానిక విష్ణుపార్థసీ ఆడిటోరియం, 9న చిలప్‌చెడ్, 10న హత్నూర, 11న వెల్దుర్తి,మాసాయిపేట మండలాలకు చెందిన వారికి వెల్దుర్తి రైతు వేదికలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

20 నుంచి ఉజ్జయిని మహంకాళీ జాతర

తూప్రాన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ పట్టణంలోని ఉజ్జయిని మహంకాళీ జాతర ఈనెల 20 నుంచి 22 వరకు నిర్వహించేందుకు నిశ్చయించారు. తూప్రాన్ మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో పుర ప్రముఖులతో సమావేశం నిర్వహించారు. పురోహితులు శలాక ఆత్రేయశర్మ ఉత్సవాలను నిర్ణయించారు. 20 మహంకాళీమాతకు బండ్లు, బోనాల సమర్పణ, 21న గావు రంగాలు, 22న మంగళవారం బొరమ్మ పూజలు నిర్వహించేందుకు నిశ్చయించారు.

సీజనల్ వ్యాధులపై ముందస్తు చర్యలు

నిజాంపేట, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించామని ఏఎన్ఎం రేణుక తెలిపారు. మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో బుధవారం ఆరోగ్య ఉపకేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గౌరీ ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.




ఎండాకాలంలో కంకర తేలిన సింగూరు రోడ్డు(ఫైల్), వానాకాలంలో బురదమయంగా మారిన సింగూరు రోడ్డు

ఎండల్లో కంకర, వానల్లో బురద

- చిన్న వానకే కుంటలను తలపిస్తున్న సింగూరు రహదారి
- అవస్థలు పడుతున్న వాహనదారులు

మునిపల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన మునిపల్లి చౌరస్తా నుంచి బుసారెడ్డిపల్లి గ్రామానికి వెళ్లే సింగూరు రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో అప్పటి ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఈ పనులు ప్రారంభించారు. ప్రభుత్వం మారి రెండేళ్లు కావస్తున్నా.. రోడ్డు పూర్తికావడం లేదు. ఎండాకాలంలో కంకరతో, వానాకాలంలో బురదతో వాహనదారులు ప్రయాణం చేయక తప్పడం లేదు. చిన్నపాటి వర్షానికే రోడ్డంతా బురదమయంగా మారడంతో పాటు గుంతల్లో నీరు నిలిచి కుంటలను తలపిస్తున్నాయి. రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల కేంద్రమైన మునిపల్లి చౌరస్తా వద్ద రోడ్డుపై గుంత ఏర్పడి అందులో నీరు వచ్చి చేరింది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి గుంతలు, బురదమయంగా మారిన రోడ్లను బాగుచేయాలని పలువురు కోరుతున్నారు.

వర్షం పడితే భయం.. భయం

- శిథిలావస్థలో మహాదేవ్‌పల్లి పాఠశాల

కల్హేర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మహాదేవ్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పాఠశాలలో మూడు తరగతి గదులు, 21 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. వర్షం పడితే నీరు కిందికు కారుతుంది. విద్యాశాఖ అధికారులు స్పందించి పాఠశాలకు నూతన భవనం మంజూరు చేయాలని గ్రామస్థులు కోరారు.



వర్షపు నీరు కారడంతో శిథిలావస్థకు చేరుకున్న మహాదేవ్‌పల్లి పాఠశాల వెనక భాగం

పదేళ్లలో సీఎస్ఐకి ఏమి చేయలేదు : ఎమ్మెల్యే

మెదక్ మున్సిపాలిటీ, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేపట్టని అభివృద్ధి తమ కాంగ్రెస్ పాలనలో చేస్తున్నామని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు ఆయన భూమి పూజ చేశారు. ముందుగా సీఎస్ఐ చర్చి ఆవరణలో రూ.45 లక్షలతో నిర్మించే యేసుప్రభు విగ్రహం, రూ.1.50 కోట్లతో నిర్మించే ట్యాంకు, రూ.18.50 లక్షలతో నిర్మించే డబుల్ ఆర్మ్ సెంట్రల్ లైట్ల పనులకు భూమిపూజ నిర్వహించారు. అనంతరం సుభాష్‌నగర్‌లో నిర్మించే అర్బన్ ప్రైమరీ సెంటర్, 11వ వార్డులో నిర్మించే మురుగుకాలువకు భూమిపూజ చేశారు. అక్కడి నుంచి మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసిన ఫుడ్‌స్టాల్‌ను ఎమ్మెల్యే పరిశీలించి, మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా చర్చి అభివృద్ధికి రూ.30 కోట్లు మంజూరు ఇచ్చిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ నిధులతో చర్చి ఆవరణలో సీసీరోడ్లు, మురుగు కాలువలు, వీధిదీపాల ఏర్పాటుకు ప్రాధాన్యమివ్వనున్నట్లు చెప్పారు. అక్కడి నుంచి మున్సిపల్ ఆధ్వర్యంలో ఇటీవలే పూర్తిచేసుకున్న వీధి వ్యాపారుల దుకాణ సముదాయం వద్ద మెప్మా మహిళలు ఏర్పాటు చేసిన ఫుడ్‌స్టాళ్లను ఎమ్మెల్యే పరిశీలించారు. మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలకు సంబంధించి రూ.3.53 కోట్ల చెక్కును మహిళలకు అందజేశారు. ఎమ్మెల్యే వెంట కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్, నాయకులు రాగి అశోక్, శ్యాంసన్ బాబీ, మేడి మధుసూదన్‌రావు, దుర్గాప్రసాద్, గంట రాజు తదితరులు ఉన్నారు.



సీఎస్ఐ చర్చిలో అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

సర్కారు జూనియర్ కాలేజీలకు మహర్దశ

- మరమ్మతులు, వసతుల కల్పనకు రూ.3.34 కోట్ల నిధులు

సంగారెడ్డి అర్బన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వసతుల కల్పనకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు జిల్లాకు రూ.3.34 కోట్ల నిధులు కేటాయిస్తూ ఇంటర్ బోర్డు కమీషనర్ కృష్ణఆదిత్య ఉత్తర్వులు వెలువరించారు. జిల్లాలోని 17 జూనియర్ కళాశాలలకు నిధులు మంజూరు చేశారు. ముఖ్యంగా రిపేర్లు, వాటర్ సప్లై, ఎలక్ట్రిఫికేషన్, సివిల్, టాయిలెట్ రిపేర్ల కోసం ఈ నిధులు వెచ్చించనున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు సర్కారు ఈ ఏడాది నిధులు మంజూరు చేసింది. దశాబ్దకాలంగా మరమ్మతులకు నిధులు రాకపోవడంతో కళాశాలలు అనేక సమస్యలతో సతమతమయ్యాయి. మౌలిక వసతుల ఊసే లేకపోవటంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో కళాశాలల్లో వసతులు మెరుగుపడనున్నాయి. ఫలితంగా కళాశాలలకు మహర్దశ పట్టనునున్నది.



సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల

సిగాచి పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్

సంగారెడ్డి రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : పటాన్‌చెరు పారిశ్రామికవాడ పాశమైలారంలోని సిగాచి పరిశ్రమ ప్రమాదానికి కారణమైన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమల్లో సౌకర్యాలపై తనిఖీలు నిర్వహించని అధికారులను సస్పెండ్ చేసి ప్రమాదంలో మృతిచెందిన వారికి రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలని, శాశ్వత అంగవైకల్యానికి గురైన వారికి రూ. 50 లక్షలు, గాయపడ్డ వారికి రూ. 10 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మల్లేశం, జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణ పాల్గొన్నారు.

త్వరలోనే అంగన్‌వాడీ భవనం నిర్మిస్తాం

- జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ హైమావతి



శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడి భవనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వెల్దుర్తి, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ భవనాన్ని తొలగించి, త్వరలో నూతన భవనాన్ని నిర్మిస్తామని జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ హైమావతి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన వెల్దుర్తి పంచాయతీ పరిధిలోని శేరిలో శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ భవనాన్ని ఐసీడీఎస్ రామాయంపేట ప్రాజెక్ట్ సీడీపీవో స్వరూపరాణితో కలిసి ఆమె పరిశీలించి, మాట్లాడారు. భవన మరమ్మతుల కోసం రూ.2 లక్షలు మంజూరయ్యాయని, కానీ మరమ్మతులు చేపడితే భవనం ఉండదని నూతన భవనం ఏర్పాటు చేయాలని ఇంజనీర్ అధికారులు తెలిపారన్నారు. అనంతరం బీసీ కమ్యూనిటీ భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి రిజిస్టర్లను తనిఖీ చేసి, చిన్నారులకు ఆట వస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ దేవలత తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమ పనులు నిలిపేయాలి : ఎంపీవో

చిన్నశంకరంపేట, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండల పరిధిలో నిర్మిస్తున్న ఫోమ్ పరిశ్రమ పనులను నిలిపేయాలని పరిశ్రమ యాజమాన్యానికి నోటీసులు జారీచేశామని ఎంపీవో గిరిజారాణి తెలిపారు. బుధవారం ఎంపీవో మాట్లాడుతూ ఫోమ్ పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు టీఎస్ ఐపాస్ అనుమతులు పొందారని, గ్రామంలో పరిశ్రమ నిర్మిస్తే ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంటుందని, పనులు నిలిపివేయాలని సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

వసతి గృహం శిథిలం

- ఎప్పుడు కులుతుందో తెలియని పరిస్థితి
- బిక్కుబిక్కుమంటున్న విద్యార్థులు



సిరిపురలో శిథిలావస్థలో ఉన్న బీసీ బాలుర వసతి గృహం

హత్నూర, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : హత్నూర మండల పరిధిలోని సిరిపుర గ్రామంలో గల బీసీ బాలుర వసతి గృహ భవనం శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. నాలుగు దశాబ్దాల క్రితం సిరిపుర పరిసర గ్రామాల విద్యార్థుల సౌకర్యార్థం బీసీ బాలుర వసతి గృహాన్ని అప్పటి ప్రభుత్వం నిర్మాణం చేసింది. అప్పట్లో వసతి గృహంలో చేరడానికి విద్యార్థులు పోటీ పడేవారు. కాలక్రమేణా భవనం శిథిలమై భవనం పైకప్పు పెచ్చులూడి ఇనుప చువ్వలు తేలాయి. దీంతో విద్యార్థులు భయంతో కాలం వెళ్లదీస్తున్నారు. ఫలితంగా వంద మందికి పైచిలుకు ఉండే విద్యార్థులు కేవలం 30 మందికి పడిపోయింది. సంబంధిత అధికారులు స్పందించి శిథిలమైన భవనం స్థానంలో నూతన భవనం నిర్మాణం చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలి

- పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్



కళాశాలల బంద్‌లో నాయకులు

జహీరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్ (ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం) సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సురేష్ పేర్కొన్నారు. ఈ విషయమై బుధవారం పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల 72 గంటల బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం ప్రతినెల ఎమ్మెల్యేలు, మంత్రులు, ప్రజాప్రతినిధులకు జీతాలు చెల్లిసుంది. కానీ విద్యార్థులకు సంబంధించిన ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంపై ఆయన విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇస్మాయిల్, ఆకాష్, మహేష్, మహ్మద్, ఏలియా, నవాబలీ, శివకుమార్, మహేశ్వరీ, సంధ్య, సరిత తదితరులు పాల్గొన్నారు.

రైల్వే వంతెన నిర్మాణానికి మట్టి పరీక్షలు



కోహీర్‌లోని 24వ రైల్వే గేట్ వద్ద మట్టి పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

కోహీర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కోహీర్‌లోని ప్రధాన రహదారిపై ఉన్న 24వ రైల్వే గేట్ వద్ద రైల్వే వంతెన నిర్మించేందుకు మట్టి పరీక్షలు నిర్వహిస్తున్నారు. కోహీర్ నుంచి కావేలి గ్రామం మీదుగా 65వ జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న ప్రధాన రహదారి పైన నిత్యం వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు కొనసాగుతాయి. ప్రతిసారి రైల్వే గేటు మూసివేయడం వల్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు వెళ్లే సమయాల్లో గేటు మూసి ఉండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. రైల్వే గేట్‌తో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతుండడంతో కోహీర్ ప్రజలతోపాటు ఆయా గ్రామాల ప్రజలు 24వ రైల్వే గేటు వద్ద రైల్వే వంతెన నిర్మించాలని కోరారు. అంతేకాకుండా రైల్వే (డీఆర్‌యూసీసీ) కమిటీ మాజీ సభ్యుడు షేక్‌ఫరీద్ మండల ప్రజల కోరిక మేరకు 166 డివిజనల్ రైల్వే వినియోగదారుల సలహా కమిటీ (డీఆర్‌యూసీసీ) సమావేశంలో రైల్వే వంతెన నిర్మించాలని రైల్వే ఉన్నంత అధికార దృష్టికి తీసుకువెళ్లారు. ప్రజల కోరిక మేరకు రైల్వే గేటుతో, 24 రైల్వే గేటు వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జిని నిర్మించేందుకు రైల్వే అధికారులు తీర్మానించారు. అందులో భాగంగానే రైల్వే గేటు వద్ద మట్టి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరైందని ఇళ్లు కూలగొట్టించారు

5వ పేజీ తరువాయి

మున్సిపాలిటీలో 20 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు ఇచ్చి, నిర్మాణ పనులకు అనుమతులు నిరాకరిస్తున్నారు. 400 ఎస్ఎఫ్‌టీల కంటే స్థలం తక్కువగా ఉందని, ఇల్లు కట్టడానికి వీల్లేదని చెప్పారు. ఉన్న ఇంటిని కూలగొట్టుకుని నిలువ నీడ లేకుండా పోయిందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిరాశ్రయులైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రమణరావు డిమాండ్ చేశారు. నిబంధనలను సడలించాలని, లేదా డబుల్‌బెడ్‌రూమ్ ఇల్లు ఇవ్వాలని పేర్కొన్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ స్పందిస్తూ స్థలం తక్కువగా ఉండటంతో జీపీఎస్ నమోదు కావడం లేదని, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు.

ఇళ్ల మధ్యన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

- ప్రమాదం అని తెలిసినా.. పట్టని అధికారులు

హత్నూర, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : హత్నూర మండల పరిధి సిరిపురం గ్రామంలో ఇళ్ల మధ్యనే ట్రాన్స్‌ఫార్మర్ నేలపైన ఉండడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ నివాస గృహాలు ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ జీవనం గడుపుతున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయినా, లెక్కచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ఇళ్ల మధ్య నుంచి ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



సిరిపురం గ్రామంలో ఇళ్ల మధ్యన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

గొంగ్లూరు గిరిజనతండాలో బోగ్ భండార్

పుల్‌కల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొంగ్లూరు గిరిజన తండాలో బుధవారం మహా బోగ్ భండార్ నిర్వహించారు. గిరిజనుల ఆరాధ్య దైవం జగదాంబ భవానీమాత, సద్గురు సంత్ సేవాలాల్ మహరాజ్ 32వ జాతర వార్షికోత్సవాల్లో భాగంగా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన పూజారులు భవానీమాత ఆలయంలో బోగ్ భండార్ నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్ నాయక్, విశ్రాంత వార్డెన్ రమావత్ చంద్రకాంత్, పూజారి పాండునాయక్, గంగ్యానాయక్ పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో పరిశుభ్రత చర్యలు



హాస్టల్‌లో పరిశుభ్రత పనులు చేపడుతున్న దృశ్యం

తూప్రాన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ పట్టణంలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవన పరిసరాలలో పరిశుభ్రత చర్యలు బుధవారం చేపట్టారు. సోమవారం కలెక్టర్ రాహుల్‌రాజ్ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ సందర్శించి, హాస్టల్ భవన పరిసరాలు శుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. దాంతో బుధవారం సమీకృత వసతి గృహం పరిసరాలు శుభ్రం చేసే పనులు చేపట్టారు. మున్సిపల్ ఆధ్వర్యంలో చేపట్టిన పరిశుభ్రత పనులను కమిషనర్ పాతూరి గణేశ్‌రెడ్డి, వార్డెన్ జనార్దన్ పరిశీలించారు.

పరిశుభ్రతలో ప్రజల సహకారం అవసరం

నారాయణఖేడ్/నాగల్‌గిద్ద, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచడానికి ప్రజల సహకారం ముఖ్యమని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ అన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా బుధవారం పలు కాలనీల్లో మురుగు తొలగింపు, రోడ్లకు ఇరు వైపులా పెరిగిన పొదల నరికివేత, నీరు నిల్వ ఉన్న ఖాళీ ప్రదేశాలు, మురుగు కాల్వల్లో దోమలు ప్రబలకుండా ఆయిల్ బాల్స్‌ను వదలడం, రోడ్లపై నిలిచిన వరద నీరు మురుగు కాల్వల్లోకి వెళ్లే పనులు చేయించారు. ఆయా పనులను కమిషనర్‌తో పాటు మేనేజర్ వెంకట శివయ్య, శానిటేషన్ అధికారి శ్రీనివాస్, ఆయా వార్డుల అధికారులు పర్యవేక్షించారు.

ఉపకార వేతనానికి నందిని ఎంపిక

కంది, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : కంది మండలంలోని ఎద్దుమైలారం ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని నందిని హైదరాబాద్‌కు చెందిన జటధార ఎడ్యుకేషన్ అకాడమి ఉపకార వేతనానికి ఎంపికైంది. రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతి పాసైన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మేలో నిర్వహించిన ఉపకార వేతన ప్రతిభాపాటవ పరీక్షలో నందిని నందిని ప్రతిభ కనబర్చింది. నందినికి జటధార సంస్థ రెండేళ్లపాటు నెలకు రూ.500 నగదు ఐఐటీ కోసం ఉచితంగా అందించనున్నది. నందిని గత సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో 543 మార్కులు సాధించి ఐఐటీలో చదవడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించింది. నందినిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయంతివాణి, ఉపాధ్యాయులు రిజిత, విజయభాస్కర్, చవాన్ సుభాష్‌సింగ్, సంధ్య తదితరులు అభినందించారు.



నందినికి మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ప్రధానోపాధ్యాయురాలు

ట్రాక్టర్ రాక.. ఆటోలో చెత్త తరలింపు

కౌడిపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : కొన్నిరోజులుగా కౌడిపల్లి మండలంలోని ముట్రాజ్‌పల్లి సింగమ్రితండాలో చెత్త సేకరణ చేయలేదు. దీంతో తండాకు చెందిన ధన్‌సింగ్ అనే యువకుడు తన సొంత ఆటోలో బుధవారం చెత్తను తీసుకెళ్లాడు. చెత్తను తీసుకెళ్లేందుకు గ్రామపంచాయతీ ట్రాక్టర్ రావడం లేదా.. అని ప్రశ్నించగా.. రావడం లేదని, కొంతకాలంగా తన ఆటోలోనే చెత్తను తరలిస్తున్నారని చెప్పాడు.

వర్షాలు పడాలని పూజలు

రేగోడు, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు కురవాలని, పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ రేగోడు మండలం మర్పల్లి హనుమాన్ ఆలయంలో కలశాలతో గ్రామస్థులు, రైతులు పూజలు చేశారు. అనంతసాగర్ గ్రామానికి చెందిన మనోహర్‌రావు, మర్పల్లి గ్రామానికి చెందిన రాములు మాట్లాడుతూ వర్షాలు పడాలని వెళ్లి పూజలు నిర్వహిస్తున్నామన్నారు.



కలశాలతో హనుమాన్ ఆలయానికి వెళ్తున్న గ్రామస్థులు